క్లుప్తంగా

దాతల సహకారాన్ని సద్వినియోగం చేసుకోవాలి

–మున్సిపల్ చైర్‌పర్సన్ కట్టా మంగ



రేపల్లె రూరల్: సేవా కార్యక్రమాలతో పాటు విద్యార్థులను ప్రోత్సహించేందుకు పట్టణ ఆదర్శ వేదిక సభ్యులు కృషి చేయటం అభినందనీయమని మున్సిపల్ చైర్‌పర్సన్ కట్టా మంగ అన్నారు. పట్టణంలోని ట్రిబుల్ ఎస్ హైస్కూలులో పట్టణ ఆదర్శ వేదిక ఆధ్వర్యంలో 10వ తరగతి విద్యార్థులకు అవసరమైన పరీక్ష సామగ్రిని గురువారం ఆమె పంపిణీ చేసి మాట్లాడారు. పట్టణంలో పేదలకు ఆదర్శ వేదిక సభ్యులు అందిస్తున్న సహకారాలు ఎనలేనివన్నారు. విద్యార్థులు దాతల సహకారాన్ని సద్వినియోగం చేసుకోవాలన్నారు. విద్యార్థులు నూరు శాతం ఫలితాలను సాధించి పాఠశాలకు మంచి పేరు తీసుకురావాలన్నారు. కార్యక్రమంలో హెచ్‌ఎం కె.మణిలాల్, పట్టణ ఆదర్శ వేదిక కార్యదర్శి వై.కిషోర్, అధ్యక్షుడు బి.వి.మోహనరావు, సభ్యులు ఆనందరావు, వెంకటేశ్వరరావు, సాయికృష్ణమాచార్యులు, నటరాజ్, సుందరరావు తదితరులు పాల్గొన్నారు.

సాంకేతిక పరిజ్ఞానాన్ని మంచికే వినియోగించాలి

–ఎస్‌ఐ తిరుపతిరావు



నిజాంపట్నం: నూతన సాంకేతిక పరిజ్ఞానంతో ఎంత మంచి జరుగుతుందో అంత చెడు జరుగుతుందని, పరిజ్ఞానాన్ని మంచి విషయాలకు వినియోగించుకోవాలని నిజాంపట్నం ఎస్‌ఐ కె.తిరుపతిరావు అన్నారు. మహిళా దినోత్సవాన్ని పురస్కరించుకుని ఆల్‌కమల్ స్కూలు విద్యార్థినులకు స్టేషన్ హౌస్ ప్రోగ్రామ్‌పై మండల కేంద్రమైన నిజాంపట్నం పోలీసు స్టేషన్‌లో అవగాహన కార్యక్రమం నిర్వహించారు. పోలీసుల విధులు, బాధ్యతలు, రికార్డుల నిర్వహణ, కమ్యూనికేషన్ సిస్టమ్, కంప్యూటర్ రూమ్, నూతన సాంకేతిక పరిజ్ఞానంతో నేరస్తులను పట్టుకునే విధానం, స్టేషన్ మేనేజ్‌మెంట్ నిర్వహణ తదితర అంశాలపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో పోలీసు సిబ్బంది, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

రైతులు పంట వివరాలు నమోదు చేయించుకోవాలి

వ్యవసాయ సహాయ సంచాలకులు విజయ్‌బాబు

రేపల్లె రూరల్: రైతులు తాము సాగు చేసే పంట వివరాలను త్వరితగతిన వ్యవసాయ అధికారులకు తెలియజేసి నమోదు చేసుకోవాలని వ్యవసాయ సహాయ సంచాకులు ఆర్.విజయ్ బాబు తెలిపారు. స్థానిక వ్యవసాయ కార్యాలయంలో గురువారం ఆయన మాట్లాడారు. పంట నమోదుతో పాటు ఈ కేవైసీ చేయించుకోవాలని, వివరాలను నమోదు చేయించుకోవటం ద్వారా ప్రకృతి వైపరీత్యాలు సంభవించిన సమయంలో రైతులను ఆదుకునేందుకు అవకాశం ఉంటుందని పేర్కొన్నారు. వ్యవసాయం ఆధునికీకరణ నేపథ్యంలో రైతులకు విశిష్ట సంఖ్యను అందించటం జరుగుతోందని, దీనికై ఫార్మర్ రిజిస్ట్రేషన్‌లో తమ వివరాలను నమోదు చేసుకోవాలని కోరారు. పూర్తి వివరాలకు తమ పరిధిలోని వ్యవసాయ కేంద్రాలలో గానీ, రైతు సేవా కేంద్రాలలో గానీ సంప్రదించాలన్నారు.

మహిళలకు ప్రత్యేక ఇన్సూరెన్స్ పథకాలు

–ఇండియన్ బ్యాంక్ మేనేజర్ సత్యసాయి



నగరం: మహిళలకు కేంద్ర ప్రభుత్వం అందిస్తున్న పథకాలను సద్వినియోగం చేసుకోవాలని ఇండియన్ బ్యాంక్ మేనేజర్ సత్యసాయి చెప్పారు. మండలంలోని మంత్రిపాలెం ఇండియన్ బ్యాంక్‌లో గురువారం మహిళ దినోత్సవ వారోత్సవాలలో భాగంగా అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా మేనేజర్ మాట్లాడుతూ మహిళల కోసం ప్రత్యేక ఇన్సూరెన్స్ పథకాలు ఉన్నాయన్నారు. మహిళలు ప్రధానమంత్రి సురక్ష యోజన, జీవనజ్యోతి పథకాలను సద్వినియోగం చేసుకోవాలని కోరారు. అదేవిధంగా పొదుపు పథకాలు కూడా ఉన్నాయన్నారు. వీటి గురించి అవగాహన కలిగి ఉండాలన్నారు. ఈ కార్యక్రమంలో సీడీపీవో సుచిత్ర, డ్వాక్రా మహిళలు పాల్గొన్నారు.

అన్నపై తమ్ముడు దాడి

తెనాలి రూరల్: స్థల వివాదం నేపథ్యంలో అన్నపై తమ్ముడు దాడి చేసి గాయపర్చడంపై కేసు నమోదైంది. పోలీసుల కథనం మేరకు పట్టణానికి చెందిన అన్నదమ్ములు తోట శివానందం, తోట శ్రీనివాసరావుకు స్థలం విషయంలో వివాదం ఉంది. ఈ నేపథ్యంలో శ్రీనివాసరావు తన అన్నపై దాడి చేసి గాయపర్చాడు. బాధితుడి ఫిర్యాదు మేరకు టూ టౌన్ పోలీసులు గురువారం కేసు నమోదు చేశారు.

పది.. భవిష్యత్‌కు పునాది

- పరీక్షలకు సన్నద్ధమవుతున్న విద్యార్థులు
- నూరు శాతం ఫలితాలకు కసరత్తు
- ఒత్తిడి తగ్గించేందుకు ఉపాధ్యాయుల కృషి
- నిత్యం రెండు గంటలు ప్రత్యేక తర్ఫీదు
- ఇప్పటికే గ్రాండ్ టెస్ట్‌లు ప్రారంభం



నల్లూరుపాలెం జెడ్పీ హైస్కూలులో గ్రాండ్ టెస్ట్‌లు రాస్తున్న విద్యార్థులు

రేపల్లె రూరల్: ప్రతి విద్యార్థి జీవితంలో పదవ తరగతి పరీక్షలు ఎంతో కీలకం. విద్యార్థులు పది పరీక్షలు ఉత్తీర్ణులయ్యారంటే జీవితంలో తొలి మెట్టెక్కినట్లేనని, భవిష్యత్‌కు పునాది పడినట్లేనని అటు తల్లిదండ్రులు, ఇటు ఉపాధ్యాయులు ఆనందిస్తారు. 9వ తరగతి వరకు చదువుకున్న పాఠశాలలోనే పరీక్షలు రాయటం, ఫలితాలను అదే పాఠశాలలో చూసుకోవటం అందరికీ తెలిసిందే. కానీ 10వ తరగతి పరీక్షలు రాసేందుకు ఇతర పాఠశాలలో విద్యార్థులు తొలిసారి బాహ్య ప్రపంచంలోకి వస్తారు. అయితే పరీక్షలకు సిద్ధమవుతున్న తరుణంలో ఒత్తిడికి గురవ్వటమే కాకుండా పరీక్షలలో తడబాటు పడుతుండటం తెలిసిందే. దీంతో ప్రభుత్వ పాఠశాలల్లో నూరు శాతం ఫలితాలను రాబట్టేందుకు విద్యార్థులకు ఇప్పటికే ప్రత్యేక తర్ఫీదు కార్యక్రమాలను ఉపాధ్యాయులు చేపట్టారు. ఉపాధ్యాయులు నిత్యం విద్యార్థులకు అందుబాటులో ఉంటూ పరీక్షలకు ఉన్న తక్కువ సమయాన్ని విద్యార్థులు సద్వినియోగం చేసుకునేలా పర్యవేక్షిస్తున్నారు. నియోజకవర్గంలోని రేపల్లె, నగరం, నిజాంపట్నం, చెరుకుపల్లి మండలాల్లో మొత్తం 3,140 మంది విద్యార్థులు పది పరీక్షలకు సిద్ధమవుతున్నారు.

ఉపయుక్తంగా గ్రాండ్ టెస్ట్‌లు

ఈ నెల 17వ తేదీన పదవ తరగతి పరీక్షలు ప్రారంభమవనున్న నేపథ్యంలో విద్యార్థులలోని భయం పోగొట్టటమే కాకుండా పబ్లిక్ పరీక్షలలో ఎటువంటి ఒత్తిడికి గురవకుండా ఎస్సీఈఆర్‌టీ రూపొందించిన ప్రశ్న పత్రాలను గ్రాండ్ టెస్ట్‌ల రూపంలో రాష్ట్ర వ్యాప్తంగా అన్ని ప్రభుత్వ పాఠశాలల్లో సోమవారం నుంచి నిర్వహిస్తున్నారు. దీనిలో భాగంగా నియోజకవర్గంలోని అన్ని ప్రభుత్వ పాఠశాలల్లో మండల విద్యా శాఖ ఆధ్వర్యంలో గ్రాండ్ టెస్ట్‌లు ఇప్పటికే ప్రారంభించారు. పరీక్షలను ఇద్దరు ఎంఈవోలతో పాటు క్లస్టర్ ప్రధానోపాధ్యాయుడితో కూడిన త్రిసభ్య కమిటీ పర్యవేక్షిస్తోంది. పరీక్షలను పబ్లిక్ పరీక్ష మాదిరిగా విద్యార్థులతో డ్రిల్ చేయించారు. గతంలో విద్యార్థులకు 11 పేపర్లుగా పరీక్ష రాయించగా ప్రస్తుతం ఏడు పేపర్లకు పరిమితం చేశారు. ఇప్పటికే తెలుగు, హిందీ పరీక్షలు రాయగా బుధవారం ఇంగ్లీష్ పరీక్ష రాశారు. 7న గణితం, 10న ఫిజికల్ సైన్స్, 11న బయోలాజికల్ సైన్స్, 13న సోషల్ పరీక్షలను నిర్వహించనున్నారు. ఈ గ్రాండ్ టెస్ట్‌ల నిర్వహణ విద్యార్థులకు ఎంతో ఉపయోగకరంగా ఉంటుందని ఉపాధ్యాయులు చెబుతున్నారు.

పబ్లిక్ పరీక్షల తరహాలో నిర్వహణ



పదవ తరగతి విద్యార్థులకు 100 రోజుల ప్రణాళికలో భాగంగా గ్రాండ్ టెస్ట్‌లను పక్కాగా నిర్వహిస్తున్నాం. పబ్లిక్ పరీక్షల తరహాలోనే నిర్ణీత తేదీలలో గ్రాండ్ టెస్ట్‌లు నిర్వహిస్తున్నాం. విద్యా శాఖ నుంచి వచ్చిన సీలు వేసిన గ్రాండ్ టెస్ట్ పేపరును గంట ముందు పరీక్ష కేంద్రంకు పంపటం జరుగుతోంది. ఈ టెస్ట్‌లతో విద్యార్థులు స్వయంగా పొరపాట్లను తెలుసుకుని సరిచేసుకునేందుకు అవకాశం ఉంటుంది. పబ్లిక్ పరీక్షలకు తక్కువ సమయం ఉండటంతో విద్యార్థులను అప్రమత్తం చేస్తున్నాం. నిరంతరం ఉపాధ్యాయులు అందుబాటులో ఉంటూ విద్యార్థుల సందేహాలను నివృత్తి చేస్తున్నారు.

– కేసనొట్టి సురేష్, డిప్యూటీ డీఈవో, బాపట్ల

మెడిటేషన్ చేయాలి



పదవ తరగతి పబ్లిక్ పరీక్షలనగానే విద్యార్థులు భయాందోళనకు గురై అనారోగ్యం పాలవుతుంటారు. ఏమాత్రం ఒత్తిడికి గురైనా మెడిటేషన్ చేయాలి. సమయం ఎంతో కీలకం. మానసిక ధైర్యం ముఖ్యం. పాఠ్యాంశాలలో సందేహాలు వస్తే ఉపాధ్యాయుడిని సంప్రదించి నివృత్తి చేసుకోవాలి. చదువుతో పాటు సమతుల ఆహారాన్ని తీసుకోవాలి. తగినంత సమయం నిద్రపోవాలి. తల్లిదండ్రులు, ఉపాధ్యాయులు చిన్నారుల పట్ల ప్రత్యేక శ్రద్ధ వహించాలి. విద్యార్థులకు ఏమాత్రం అనారోగ్య సమస్య తలెత్తినా వైద్యుడిని సంప్రదించాలి.

– డాక్టర్ గణేష్, ప్రభుత్వ వైద్యశాల వైద్యుడు, రేపల్లె

మహిళా పోస్టల్ ఉద్యోగులకు సన్మానం



కొల్లూరు పోస్టాఫీసులో మహిళా ఉద్యోగులకు సన్మానం

కొల్లూరు : మహిళా దినోత్సవాన్ని పురస్కరించుకొని మహిళా పోస్టల్ ఉద్యోగులను ఘనంగా సత్కరించారు. గురువారం కొల్లూరు పోస్టాఫీసులో నిర్వహించిన కార్యక్రమంలో భాగంగా రేపల్లె పోస్టల్ అసిస్టెంట్ సూపరింటెండెంట్ కె.ఏడుకొండలు మాట్లాడుతూ మహిళలు అన్ని రంగాల్లో రాణిస్తూ పురుషులకు సమానంగా ముందంజలో ఉన్నారని కొనియాడారు. మహిళా ఉద్యోగులకు ఎటువంటి ఇబ్బందులకు గురి చేయకుండా కార్యాలయాల్లో సహాయ, సహకారాలు అందజేయాల్సిన బాధ్యత పురుష ఉద్యోగులపై ఉందన్నారు. కార్యక్రమంలో పోస్టుమాస్టర్ పి.సాయిప్రసాద్, పోస్టుమ్యాన్‌లు డి.రవికుమార్, సీహెచ్ శ్రీను తదితరులు పాల్గొన్నారు.

విద్యుత్ మోటారు చోరీ

కర్లపాలెం: మండల పరిధిలోని నల్లమోతువారిపాలెం గ్రామానికి చెందిన ఈవూరి వెంకటేశ్వరరావు తమ స్వగ్రామంలో మిరపతోట సాగు చేశాడు. మిరప తోటకు నీరు పెట్టేందుకు తోటలో ఏర్పాటు చేసిన విద్యుత్ మోటారు ఇటీవల చోరీకి గురికావటంతో గురువారం కర్లపాలెం పోలీసులకు ఫిర్యాదు చేశాడు. ఈ ఘటనపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని కర్లపాలెం ఎస్‌ఐ రవీంద్ర తెలిపారు.

పేద వర్గాలను కూటమి ప్రభుత్వం అప్పుల పాలు చేస్తుంది

వైఎస్సార్‌సీపీ రాష్ట్ర అధికార ప్రతినిధి వరికూటి అశోక్‌బాబు



నూతన గ్రామ కమిటీ సభ్యులను సత్కరిస్తున్న వేమూరు నియోజకవర్గ ఇన్‌చార్జి వరికూటి అశోక్‌బాబు

కొల్లూరు : కూటమి ప్రభుత్వం ప్రజలకు అబద్ధపు హామీలు గుప్పించి అధికారం దక్కించుకున్న అనంతరం సంక్షేమ పథకాలు అమలు చేయకుండా పేద వర్గాలను అప్పుల పాలు చేస్తుందని వైఎస్సార్‌సీపీ రాష్ట్ర అధికార ప్రతినిధి, వేమూరు నియోజకవర్గ వైఎస్సార్‌సీపీ సమన్వయకర్త వరికూటి అశోక్‌బాబు విమర్శించారు. గురువారం మండలంలోని ఈపూరు, చిలుమూరు, అనంతవరం, క్రాప గ్రామాలలో నూతన గ్రామ కమిటీల ఎంపిక ప్రక్రియలో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ, సూపర్ సిక్స్ పథకాల పేరుతో ప్రజలను మభ్యపెట్టి అధికారంలోకి వచ్చిన సీఎం చంద్రబాబు పథకాలను అమలు చేయకపోవడంతో పేద వర్గాలు ఆర్థిక ఇబ్బందులకు గురవుతున్నాయన్నారు. మైక్రో ఫైనాన్స్ సంస్థల వద్ద అధిక వడ్డీలకు రుణాలు తెచ్చుకొని చెల్లించలేక అప్పుల ఊబిలో కూరుకుపోయే పరిస్థితి దాపురించిందని ఆవేదన వ్యక్తం చేశారు. కూటమి ప్రభుత్వం సంక్షేమ పథకాలను అమలు చేయకపోగా విద్యుత్ బిల్లులు పెంచడానికి తోడు, నిత్యావసర సరకుల ధరలు విపరీతంగా పెరిగిపోవడంతో సామాన్య ప్రజల జీవనం మృగ్యమవుతుందన్నారు. వైఎస్సార్‌సీపీ ప్రభుత్వ హయాంలో మాజీ సీఎం వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి సంక్షేమంతో పాటు, అభివృద్ధికి పెద్దపీట వేయడంతో పేద వర్గాల ప్రజలు సంతోషకరమైన జీవనాన్ని గడిపారన్నారు. కూటమి ప్రభుత్వంలో పండించిన పంటలకు మద్దతు ధర లేక రైతులు తీవ్ర నష్టాలకు గురయ్యారన్నారు. పేద వర్గాలపై టీడీపీ పెత్తందారులు దౌర్జన్యాలకు, బెదిరింపులకు పాల్పడి అలజడులు సృష్టిస్తే చూస్తూ ఊరుకునే ప్రసక్తి లేదని హెచ్చరించారు. నూతనంగా గ్రామ కమిటీలను ఏర్పాటు చేయడం ద్వారా ప్రజా సమస్యలపై వైఎస్సార్‌సీపీ పోరాటాలు చేయడానికి సన్నద్ధమవుతుందన్నారు. ఈపూరు గ్రామ నూతన కమిటీ అధ్యక్షుడిగా నిమ్మగడ్డ వెంకటస్వామితోపాటు, ఇతర కమిటీ సభ్యులను ఏకగ్రీవంగా ఎంపిక చేశారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ కొల్లూరు మండల అధ్యక్షుడు సుగ్గున మల్లేశ్వరరావు, సర్పంచి మంచాల వసుందరసుధీర్, మాజీ ఎంపీపీ పెరికల పద్మారావు, నాయకులు గుంటూరు పవన్, బాణాల తనీష్, స్థానిక నాయకులు పాల్గొన్నారు.

సైబర్ క్రైమ్‌లపై అవగాహన కలిగి ఉండాలి

ఎస్‌ఐ టి.అనీల్‌కుమార్



పోలీస్ స్టేషన్ విధులు సిబ్బంది పనితీరులను వివరిస్తున్న ఎస్‌ఐ అనీల్‌కుమార్

చెరుకుపల్లి: సమాజంలో జరుగుతున్న సైబర్ క్రైమ్‌లపై విద్యార్థులు అవగాహన కలిగి ఉండాలని ఎస్‌ఐ అనీల్‌కుమార్ పేర్కొన్నారు. అంతర్జాతీయ మహిళా దినోత్సవాన్ని పురస్కరించుకొని నిర్వహిస్తున్న వారోత్సవాలలో భాగంగా గురువారం గుళ్ళపల్లి జెడ్పీ ఉన్నత పాఠశాల బాలికలకు ఓపెన్ హౌస్ కార్యక్రమం నిర్వహించి పోలీస్ స్టేషన్ సిబ్బంది విధులు, స్టేషన్ పనితీరు ఎస్‌ఐ వివరించారు. ఈ సందర్భంగా పోలీస్ స్టేషన్‌లో స్టేషన్ రిసెప్షన్, సబ్ ఇన్‌స్పెక్టర్, రైటర్ విధులు, లాకప్, కంప్యూటర్ రూమ్, ఉమెన్ హెల్ప్ డెస్క్, కమ్యూనికేషన్ సిస్టం వంటి విషయాలపై విద్యార్థులకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఎస్‌ఐ మాట్లాడుతూ మారుతున్న కాలానికి అనుగుణంగా స్త్రీలు పురుషులతో పాటు అన్ని రంగాల్లో దూసుకుపోతూ రాణిస్తున్నారని, బాలికలు పాఠశాల స్థాయి నుంచే అన్ని రంగాల పట్ల అవగాహన కలిగి రాణించాలని సూచించారు. అనంతరం విద్యార్థులకు బాలల హక్కులు, మహిళా చట్టాలు, బాల్య వివాహాల నిర్మూలన, విద్యాహక్కు చట్టం తదితర వాటిపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో పోలీస్ సిబ్బంది, విద్యార్థులు పాల్గొన్నారు.

దివ్యాంగ చిన్నారులకు మెరుగైన బోధన అవసరం



రికార్డులు పరిశీలిస్తున్న ఐఈడీ సమన్వయకర్త జ్యోత్స్న

భట్టిప్రోలు (కొల్లూరు) : ప్రత్యేక అవసరాలు గల దివ్యాంగ చిన్నారులకు మెరుగైన బోధన అందించాలని ఐఈడీ జిల్లా సమన్వయకర్త మట్టా జ్యోత్స్న సూచించారు. గురువారం భట్టిప్రోలులోని ఐఈడీ కేంద్రాన్ని తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ప్రత్యేక అవసరాలు గల చిన్నారులకు ప్రభుత్వం అందజేస్తున్న పలు రకాల అలవెన్స్‌లు సవ్యంగా అందే విధంగా చూడాలని అన్నారు. ఈ సందర్భంగా ఆమె రికార్డులను తనిఖీ చేసి రికార్డుల నిర్వహణ మరింత మెరుగ్గా ఉండాలని అన్నారు. కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయులు కోంద్రు హవీలా, భువనేశ్వరి, శ్రీలత, శ్రీనివాసరావు, ఐఈడీ కేంద్ర ఉపాధ్యాయులు డి.మేరీ ఇవాంజిలిక, కె.రత్నాకర్ తదితరులు పాల్గొన్నారు.

ఎన్‌ఆర్‌ఈజీఎస్ పనులు ప్రణాళికాబద్ధంగా నిర్వహించాలి

ఎంపీడీఓ షేక్ మహబూబ్ సుభాని



ఎన్‌ఆర్‌ఈజీఎస్ సిబ్బందితో సమీక్ష సమావేశంలో ఎంపీడీఓ సుభాని

చెరుకుపల్లి: మండలంలో మహాత్మాగాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పనులు సిబ్బంది గ్రామాల్లో ప్రణాళిక బద్ధంగా నిర్వహించాలని ఎంపీడీఓ షేక్ మహబూబ్ సుభాని పేర్కొన్నారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో గురువారం ఎంపీడీఓ అధ్యక్షతన ఫీల్డ్ అసిస్టెంట్స్, ఎంసీసీ సిబ్బంది, ఏపీఓ, టెక్నికల్ అసిస్టెంట్, కంప్యూటర్ ఆపరేటర్, బీఎఫ్‌టీలతో సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో రోజు గ్రామ పంచాయతీ వారీగా లేబర్ బడ్జెట్ మొబలైజేషన్, ఫారం పాండ్స్ గుర్తించి వాటికి ప్రణాళిక తయారు చేయుట, ఆమోదించిన ఒక్కొక్క ఫారం పాండుకు 10 నుంచి 20 మంది వేతనదారులను అనుసంధానం చేసుకొని వారికి పని కల్పించుట, ప్రతి గ్రామ పంచాయతీకి 5 సోక్ పిట్స్ గుర్తించి వాటికి వెంటనే ప్రతిపాదనల కొరకు ప్రణాళిక తయారు చేయాలని, 72–99 డేస్‌కు హౌస్ హోల్డ్‌కు డిమాండ్, వర్క్ కేటాయించి పని కల్పించుట, సరాసరి వేతనం రూ.300 వచ్చే విధంగా పని కల్పించుట, 2025–26కు సంబంధించి హార్టికల్చర్, ఇతర ప్లాంటేషన్ వర్కులను గుర్తించుట వంటి ఎనిమిది అంశాలపై సిబ్బందితో సమీక్ష నిర్వహించారు.

ఎస్సీ, ఎస్టీ, కేసు నమోదు

వేమూరు: కులం పేరుతో ఇష్టారాజ్యంగా దూషించిన ఘటనపై ఎస్సీ, ఎస్టీ కేసు నమోదు చేయడం జరిగిందని ఎస్‌ఐ రవికృష్ణ తెలిపారు. ఎస్‌ఐ తెలిపిన వివరాల ప్రకారం వేమూరు మండలంలోని చదలవాడ గ్రామానికి చెందిన గుంటూరు విజయకుమారి, తెనాలి మండలం చక్రయపాలెం గ్రామానికి చెందిన నిశ్శంకర ఉదయం కుమార్‌ల మధ్య చదలవాడ గ్రామంలో బుధవారం గొడవ జరిగింది. నిశ్శంకర ఉదయం కుమార్ కులం పేరుతో ఇష్టారాజ్యంగా దూషించడం జరిగిందని గుంటూరు విజయకుమారి ఫిర్యాదు చేసిందన్నారు. ఆమె ఫిర్యాదు మేరకు విచారణ చేసి గురువారం కేసు నమోదు చేయడం జరిగిందన్నారు. ఉదయం కుమార్‌ను అరెస్టు చేసేందుకు చర్యలు తీసుకోవడం జరుగుతుందని ఎస్‌ఐ రవికృష్ణ తెలిపారు.

మైనర్‌తో వివాహం.. వరుడిపై కేసు

తెనాలి రూరల్: మైనర్‌ను వివాహం చేసుకున్న యువకుడు, అతని కుటుంబసభ్యులపై కేసు నమోదైంది. పోలీసుల కథనం మేరకు... పట్టణ మారిస్‌పేటకు చెందిన 16 ఏళ్ల బాలికకు ఈ నెల 2వ తేదీన కుటుంబసభ్యులు వివాహం చేశారు. విషయం ఆలస్యంగా వెలుగులోకి రావడంతో సంబంధిత వార్డు సచివాలయ కార్యదర్శి పోలీసులకు ఫిర్యాదు చేశారు. బాలికను వివాహం చేసుకున్న యువకుడు, అతడి కుటుంబ సభ్యులపై గురువారం త్రీ టౌన్ ఎస్‌ఐ షేక్ కరిముల్లా కేసు నమోదు చేశారు.

నేడు మధుర కవి నూతక్కి జయంతి వేడుకలు



కరపత్రాన్ని ఆవిష్కరిస్తున్న సభ్యులు

తెనాలి టౌన్: మధుర కవి, కావ్య కళానిధి నూతక్కి అబ్రహం జయంతి సభను శుక్రవారం రూరల్ గ్రామం కొలకలూరు బాబు జగ్జీవన్ రామ్ కమ్యూనిటీ హాలులో నిర్వహించనున్నట్లు ఆది జాంబవ దళిత ఉద్యోగుల సేవా సమితి కార్యదర్శి ఉన్నం యెహేస్కేల్ గురువారం తెలిపారు. దీనికి సంబంధించిన పోస్టర్‌ను దళిత ఉద్యోగుల సేవా సమితి సభ్యులు ఆవిష్కరించారు. డాక్టర్ పి.జోసఫ్ రత్నాకర్ అధ్యక్షతన జరిగే కార్యక్రమంలో ముఖ్యవక్తగా విశ్రాంత తెలుగు అధ్యాపకులు డాక్టర్ భూసురపల్లి వెంకటేశ్వర్లు, గౌరవ అతిథులుగా ప్రముఖ రంగ స్థల నటులు పులి పుష్పరాజు, అక్షరజ్యోతి కాన్వెంట్ కరస్పాండెంట్ బీవీఆర్ శర్మ, ప్రముఖ కవి డాక్టర్ నూతక్కి పూర్ణ ప్రజ్ఞాచారి పాల్గొంటారని నిర్వాహకులు తెలిపారు. కరపత్రం ఆవిష్కరణ కార్యక్రమంలో యడ్లపల్లి రవికిరణ్; సుద్దపల్లి మురళీధర్, మోదుకూరి గురుదేవ్, కొలకలూరి పాపారావు, ఉన్నం జాన్‌బాబు, పలువురు సభ్యులు పాల్గొన్నారు.

నేటి నుంచి శిఖర ప్రతిష్ట ఉత్సవాలు



ఆహ్వానపత్రిక ఆవిష్కరిస్తున్న దృశ్యం

తెనాలి: స్థానిక నెహ్రూరోడ్డులోని శ్రీరుక్మిణీ సత్యభామ సమేత శ్రీగోవర్ధన స్వామి, వీరప్రతాప ఆంజనేయస్వామి దేవస్థానంలో ఈ నెల 9వ తేదీన జీవధ్వజ శిఖర ప్రతిష్ట, మహా కుంభాభిషేక ఉత్సవం జరగనుంది. ఆలయ వంశపారంపర్య అర్చకులు టి.రఘు, వేదాంత మాధవ్‌కుమార్‌లు ఆలయ ప్రాంగణంలో గురువారం ఆహ్వానపత్రికను ఆవిష్కరించారు. అనంతరం వివరాలను తెలిపారు. ప్రాచీన కాలానికి చెందిన ఈ దేవాలయానికి 15వ శతాబ్దంలో శ్రీకృష్ణదేవరాయలు సందర్శించారని, సంబంధిత శాసనం ఆలయ ప్రాంగణంలోనే ఉన్నట్టు అర్చకులు గుర్తుచేశారు. భక్తుల సహకారంతో స్వామివారి ముఖమండప పునర్నిర్మాణం పూర్తి చేసినట్టు తెలిపారు. 7వ తేదీన అంకురార్పణతో మొదలు

8న ఉదయం అగ్ని ప్రతిష్టాపన కుంభారాధన, శ్రీగోవర్ధనస్వామి, రాజ్యలక్ష్మి, గోదాదేవి అమ్మవార్లకు కలశ స్నపన, హోమాలు తదితరాలు జరుగుతాయని చెప్పారు. 9వ తేదీ ఉదయం 10.54 గంటలకు జీవధ్వజ శిఖర ప్రతిష్ట, విమాన గోపురాలకు మహాకుంభాభిషేకాలు ఉంటాయని వివరించారు. 10వ తేదీ ఉదయం స్వామివారి శాంతి కళ్యాణం, అన్నప్రసాద వితరణ ఉంటాయని తెలిపారు. ఆహ్వానపత్రిక ఆవిష్కరణలో ఆలయ వంశపారంపర్య ధర్మకర్తల కుటుంబసభ్యులు భాగవతుల నిఖిల్ శాండిల్య, వంశపారంపర్య అర్చకులు టి.అనంతాచార్యులు, వేదాంతం కేశవమూర్తి, టి.యశ్వంత్, ఆలయ సిబ్బంది బి.సుబ్బారావు తదితరులు పాల్గొన్నారు.

ఎడ్ల బల ప్రదర్శనకు ఏర్పాట్లు

తెనాలి రూరల్: ఈ నెల 29 నుంచి ఏప్రిల్ 4వ తేదీ వరకు తెనాలి మార్కెట్ యార్డు ఆవరణలో జరగనున్న జాతీయ స్థాయి ఎడ్ల బల ప్రదర్శన పోటీల ఏర్పాట్లు ప్రారంభమయ్యాయి. ఆలపాటి శివరామకృష్ణయ్య మెమోరియల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో ఎమ్మెల్సీ ఆలపాటి రాజేంద్రప్రసాద్ సారథ్యంలో జరగనున్న ఈ పోటీలకు గురువారం భూమి పూజ నిర్వహించారు. వేద పండితులు పూజలు నిర్వహించి పనులను ప్రారంభించారు. టీడీపీ నాయుకులు పర్యవేక్షిస్తున్నారు. టీడీపీ పట్టణ అధ్యక్షుడు తాడిబోయిన హరిప్రసాద్, అర్బన్ బ్యాంక్ చైర్మన్ మంగమూరి హరిప్రసాద్, మాజీ ఎంపీపీ వెంకట్రావు, చిన్ని, హరికృష్ణ పాల్గొన్నారు.

పశు పోషకులకు ఉచితంగా మందుల పంపిణీ



మందులు పంపిణీ చేస్తున్న డాక్టర్ స్మిత్

రేటూరు(కాకుమాను): కళాశాల ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న సేవా కార్యక్రమాలను రైతులు, పశుపోషకులు సద్వినియోగం చేసుకోవాలని బాపట్ల జిల్లా ఎన్‌టీఆర్ వ్యవసాయ కళాశాల అసోసియేట్ డీన్ డాక్టర్ డి.డి.స్మిత్ తెలిపారు. మండలంలోని రేటూరులో గురువారం కళాశాల ఆధ్వర్యంలో ఉచిత పశు వైద్య శిబిరం నిర్వహించారు. ఈ సందర్భంగా స్మిత్ మాట్లాడుతూ ఏటా కళాశాల ఆధ్వర్యంలో రెండు గ్రామాలను ఎంచుకుని ఫైనల్ ఇయర్ ఇంజినీరింగ్ విద్యార్థులతో పలు సేవా కార్యక్రమాలు చేపడుతున్నట్లు తెలిపారు. ఈ ఏడాది మండలంలోని రేటూరు, అప్పాపురం గ్రామాలను ఎంచుకుని గత మూడు రోజులుగా అనేక సేవా కార్యక్రమాలు చేపట్టినట్లు పేర్కొన్నారు. పశువులు, గొర్రెలు, మేకలకు వైద్య పరీక్షలు నిర్వహించి ఉచితంగా మందులు పంపిణీ చేసినట్లు తెలిపారు.రైతులకు సాగు విషయంలో తీసుకోవల్సిన జాగ్రత్తలు గురించి వివరించనున్నట్లు చెప్పారు. కార్యక్రమంలో పశువైద్యులు శేఖర్, శైలజ, సౌమ్య, కళాశాల ఎన్‌సీసీ కో–ఆర్డినేటర్లు విజయ్ కుమార్, కె.లావణ్య, ఆరుద్ర, వెంకటేశ్వర్లు, ఇంజినీరింగ్ విద్యార్థులు, పశుపోషకులు పాల్గొన్నారు.

రోడ్లపై చెత్త కనిపిస్తే చర్యలు



తెనాలి అర్బన్: రోడ్లపై చెత్త కనిపిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని మున్సిపల్ కమిషనర్ బండి శేషన్న హెచ్చరించారు. చెంచుపేటలో గురువారం ఉదయం ఆయన పర్యటించారు. ఆ ప్రాంతంలో పారిశుద్ధ్య నిర్వహణ పనులను పరిశీలించి పలు సూచనలు చేశారు. రైతుబజార్ వద్ద వ్యర్థాలను కార్మికులకు అప్పగించాలని సూచించారు. పరిసరాలు పరిశుభ్రంగా ఉంచుకోవాలన్నారు. అనంతరం బస్టాండ్ సమీపంలోని అన్న క్యాంటీన్‌కు వెళ్లి అల్పాహారాన్ని పరిశీలించారు. అసిస్టెంట్ కమిషనర్ వీఎం లక్ష్మీపతిరావు చినరావూరులో పర్యటించారు. కొందరు అనధికారికంగా రోడ్లపై నిర్మాణాలు చేయడాన్ని గమనించిన ఆయన వాటిని తొలగించాలని ఆదేశించారు. అధికారుల వెంట పలువురు శానిటరీ ఇన్‌స్పెక్టర్లు, సచివాలయ ఉద్యోగులు ఉన్నారు.